పంద్రాగస్టు వేడుకలకు ముస్తాబు


నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాలు ప్రదర్శిస్తున్న అధికారులు


పాయకరావుపేటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ


బోడపాలెంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


అడ్డురోడ్డు లో అందుబాటులో మూడురంగుల జెండాలు

అచ్యుతాపురం : అచ్యుతాపురం ,మునగపాక మండలాల్లో పంద్రాగస్టు వేడుకలకు ఆయా మండలాలు ముస్తాబయ్యాయి. మండల ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, పలు స్వచ్ఛంద సంస్థలతో పాటు సేవా సంస్థల్లో వేడుకలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. జెండా వందనం తర్వాత విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాలల హెచ్ఎంలే జెండా వందనం చేయనున్నారు.

ముచ్చటగా మువ్వన్నెల జెండాలు....

ఎస్.రాయవరం: మండలంలో ఆగస్టు 15 వేడుకలకు ముస్తాబు అయ్యింది.విద్యార్థులు పాఠశాలలో తరగతి గదులు, మండల పరిషత్ అధికారులు మండల కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు వేడుకలకు ముస్తాబు చేశారు. అడ్డురోడ్డు దుఖాణాల్లో అయితే మూడు రంగులు జెండాలు విక్రయానికి ఆకర్షనీయంగా అందుబాటులో ఉంచారు. జాతీయ జెండా అన్ని రకాల సైజులు అబిమానుల ఎగురవేసుకునే రీతిలో తీర్చి దిద్దారు.

కోటవురట్ల: బోడపాలెం ఎంపీయూపీ స్కూల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు జాతీయ పతాకాన్ని చేతబట్టి వీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ యువత స్వాతంత్ర్య దినోత్సవం ప్రాధాన్యాన్ని తెలుసుకోవాలన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుబావులు ప్రాణత్యాగం చేశారన్నారు. విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు సాంబశివరావు, సాయి, త్రినాథరావు, సత్యవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నక్కపల్లిలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావులు జాతీయ జెండాను ప్రదర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అవుతోందని, ఈ వేడుకలను ఘనంగా జరుపుకోవాలన్నారు. ప్రతి భారతీయుడు తమ ఇంటిపై జాతీయ జెండాలను ప్రదర్శించి దేశభక్తి చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి సీతారామరాజు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం వద్ద

పాయకరావుపేట : భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.స్వప్న, ఏవో వర్మరాజు, గ్రామ కార్యదర్శులు వై.వి.సత్యనారాయణ, బీపీబీఎల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు కూటమి నాయకులు పట్టణంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. గౌతమ్ థియేటర్ సెంటర్ నుంచి సూర్యమహల్ సెంటర్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోట నగేష్, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

మార్మోగిన భారతమాతాకీ జై నినాదం

యలమంచిలి రూరల్: భారత్ మాతాకీ జై నినాదంతో బుధవారం యలమంచిలి పట్టణంలోని ప్రధాన రహదారి మార్మోగింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ చేపట్టారు. బస్ కాంప్లెక్స్ వద్ద మానవహారం చేశారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నేటి తరాలకు తెలియజేయాలన్న ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమం నిర్వహించామని ఇంఛార్జ్ మున్సిపల్ కమిషనర్ డి.ప్రభాకర్రావు అన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అహింస, సత్యాగ్రహం ఆయుధాలుగా జరిగిన భారత స్వాతంత్ర్య ఉద్యమం ప్రపంచానికే ఆదర్శమని పలువురు తమ ప్రసంగాల్లో అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం డి.పద్మావతి, సీవో ఉమ, శానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారిణి నీలిమ, పట్టణ ప్రణాళికాధికారిణి శ్రీలక్ష్మి, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది


యలమంచిలిలో ర్యాలీ చేస్తున్న మున్సిపల్, మెప్మా ఉద్యోగులు, విద్యార్థులు


విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న అచ్యుతాపురం పోలీస్స్టేషన్

అచ్యుతాపురం : అచ్యుతాపురం పోలీస్ స్టేషన్కు పంద్రాగస్టు సందడి వచ్చింది. బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్కు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి వెలిగించారు. రంగు,రంగుల కాంతులతో స్టేషన్ ధగధగలాడింది.

క్లుప్తంగా

వరి నాట్లపై రైతులకు సూచనలు


పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయధికారి సౌజన్య

ఎస్.రాయవరం : నాట్లు వేసే అన్నదాతలు మొక్కకు మొక్కకు నిర్దేశించిన దూరం వదిలి నాట్లు వేయాలని మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ నాట్లు వేసే రైతులకు అవగాహన కల్పించారు. పంటసాగులో సేంద్రియ ఎరువులు ఉపయోగించినట్టయితే మరింత మంచి ఫలితాలు వస్తాయన్నారు. రసాయనిక ఎరువులు వాడకంలో కూడా మోతాదుకు మించి ఎరువులు వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ సూచనలు, సిబ్బంది, ఆర్బీకేల సహాయకులు తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూల్కు రహదారి ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే సుందరపు విజయ్కుమార్కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (మునగపాక): మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్కి వెళ్లే మట్టిరోడ్డు స్థానంలో సీసీ రోడ్డు వేయించాలని పాఠశాల ప్రిన్సిపాల్ పీలా ఆశ యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్కుమార్ను కోరారు. స్వాతంత్ర్య దిన వేడుకల్లో పాల్గొనాలని ఆమె బుధవారం ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల రహదారి సమస్య గురించి ఎమ్మెల్యే వద్ద ప్రస్తావించగా, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా గరల్స్ హాస్టల్ వద్ద సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు వేయించాలని, ప్లే గ్రౌండ్ నిర్మించాలని ఎమ్మెల్యేను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాసరావు, హీరాలాల్, ఉమా మహేశ్వరావు, నూతన్, నాగేశ్వరావు పాల్గొన్నారు.

ప్రశాంతి పాలిటెక్నిక్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూల నిర్వహణలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం యెకోహోమా కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 86 మంది మహిళలు ఇంటర్వ్యూలకు హాజరు కాగా,52 మంది ఎంపికయ్యారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి మధు విద్యార్థులకు అవగాహన కల్పించారు. యెకోహోమా కంపెనీ ప్రతినిధులు శ్రవణ్ కుమార్, బాలాజీలు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికయిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ధర్మిరెడ్డి ప్రసాద్ అభినందించారు.

పాఠశాలకు మైక్సెట్ వితరణ


మైక్ సెట్ అందజేస్తున్న దృశ్యం

మునగపాక (అచ్యుతాపురం) : మునగపాక మండలంలోని నాగులాపల్లి ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం మైక్ సెట్, పుస్తకాలు,పెన్నులు బుధవారం అందజేశారు. తన తండ్రి జ్ఞాపకార్థం అప్పలనాయుడు కుమారుడు భవానీ శంకర్ మైక్ సెట్, 300 పుస్తకాలు, 300 పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శంకర్రావు, మళ్ల చంద్రశేఖర్, హరిప్రసాద్, మళ్ల ఉమా మహేశ్వరరావు, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేశ్, మళ్ల సంతోష్, మళ్ల దొరమ్మనాయుడు, ఉపాధ్యాయులు భాస్కర్రావు, రామకృష్ణ పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణ తగదు’


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్ తదితరులు

పాయకరావుపేట : ఎస్సీ వర్గీకరణ చేయడం తగదని, వర్గీకరణ వల్ల మాలలకు, మాదిగలకు కూడా ఎంతో నష్టం వుందని దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో పట్టణంలో గల అంబేద్కర్ పార్కులో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చెల్లదని తీర్పునిచ్చిందన్నారు. కానీ ప్రస్తుతం సుప్రీంకోర్టు తీర్పు వల్ల మాలలకు ఎంతో నష్టం వస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 72 సంవత్సరాలు అయినప్పటికీ ఎస్సీలకు మాత్రం స్వాతంత్ర్యం రాలేదన్నారు. మాలల పంతం , ఎస్సీ వర్గీకరణ అంతం అనే నినాదంతో పోరాటం సాగించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 15న అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో దళిత నాయకులు నెలపర్తి అర్జున్, పల్లా విలియం కేరి, నెలపర్తి నాగరాజు, ఇంజరపు సూరిబాబు, గారా చంటి, పల్లా ప్రసాద్, ఐ.ఎస్.మూర్తి, కవ్వల కుమార్ పాల్గొన్నారు.

బొత్సకు నేతల అభినందన


బొత్ససత్యనారాయణను అభినందిస్తున్న కంబాల జోగులు,బూడి ముత్యాలనాయుడు


బొత్సను అభినందిస్తున్న వీసం

నక్కపల్లి : స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నిక కాబోతున్న మాజీ మంత్రి ఉత్తరాంధ్ర వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణను పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అభినందించారు. బుధవారం బొత్సను మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడితో కలిసి విశాఖలో ఆయన గృహంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ సంఖ్యాబలం లేకపోయినప్పటికీ వైఎస్సార్సీపీ తరపున గెలిచిన ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేసి దొడ్డిదారిలో ఎమ్మెల్సీ స్థానాన్ని కై వసం చేసుకుందామని కూటమి నాయకులు ప్రయత్నాలు చేసారన్నారు. తమ పార్టీకి చెందిన ఎంపీటీసీలు ఎవరూ టీడీపీ ప్రలోభాలకు తలొగ్గలేదన్నారు, నిజాయితీగా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నారన్నారు. దీంతో తోక ముడిచిన టీడీపీ తన అభ్యర్థిని నిలబెట్టలేకపోయిందన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన బొత్సవంటి సీనియర్ నాయకుడ్ని ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉత్తరాంధ్రలో పార్టీ మరింత పటిష్టమవుతుందన్నారు, వైఎస్సార్ సీపీ పూర్వ వైభవానికి బొత్స గెలుపు నాంది పలుకుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీకిచెందిన ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, నాయకులు ఈ ఐదేళ్లు కూటమి ప్రభుత్వ దురాగతాలను ఎదుర్కొంటూ ప్రజల పక్షాన పోరాటాం చేయాలన్నారు. బొత్సను కలిసిన వారిలో పార్టీ ఎస్సీ సెల్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కంబాల సందీప్ తదితరులు ఉన్నారు.

అభినందనలు తెలిపిన వీసం

నక్కపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను బుధవారం కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ కలిశారు. ఎమ్మెల్సీగా ఏక గ్రీవంగా ఎన్నిక కాబోతున్న బొత్సను కలిసి దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేసినట్టు వీసం తెలిపారు. టీడీపీ నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా మా పార్టీ నుంచి గెలుపొందిన ఎంపీటీసీలెవరూ తలొగ్గలేదన్నారు. నిబద్ధతతో నిజాయితీతో కూడిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వైఎస్సార్సీపీలో ఉండడం ఎంతో గర్వంగా ఉందన్నారు. బొత్స నాయకత్వంలో ఉత్తరాంధ్రలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా పోరాటం చేస్తారని తెలిపారు.

జగన్ను కలసిన ఎంపీ బాబూరావు


మాజీ సీఎం జగన్మోహన్రెడ్డిని కలిసిన ఎంపీ బాబూరావు తదితరులు

నక్కపల్లి : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని బుధవారం రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కలిసారు. తాడేపల్లిలో కలిసి ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ స్థానం వైఎస్సార్సీపీ ఏకగ్రీవంగా కైవసం చేసుకోబోతున్న నేపథ్యంలో అభినందనలు తెలపడం జరిగిందని బాబూరావు తెలిపారు. జగన్మోహన్రెడ్డి బలపరచిన అభ్యర్థి బొత్సను ఎదుర్కొనే ధైర్యం లేకనే కూటమి పార్టీలో తమ అభ్యర్థిని బరిలో నిలపలేకపోయాయన్నారు. బొత్స ఎంపిక ద్వారా ఉత్తరాంధ్రలో పార్టీ మరింత పటిష్టమవుతుందని, కార్యకర్తలు, నాయకుల్లో కొత్త జోష్ నింపుతుందన్నారు. జగన్ను కలిసిన వారిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, గొల్ల సాయికార్తీక్ ఉన్నారు.

జనసేనకు ఝలక్

- ఐదురోజుల్లోనే సొంత గూటికి వైస్ ఎంపీపీ శిలపరశెట్టి ఉమ


ఈ నెల 8న మంగళగిరిలో ఎమ్మెల్యే సుందరపు విజయ్కుమార్ సమక్షంలో జనసేనలో చేరిన శిలపరశెట్టి ఉమ



బుధవారం వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వై.ఎస్. జగన్తో శిలపరశెట్టి ఉమ, భర్త గణేష్

యలమంచిలి రూరల్ : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడానికి ప్రలోభాలు, మాయమాటలతో మభ్యపెట్టి అయిష్టంగా తమ పార్టీల్లోకి చేర్చుకోవడానికి యత్నించిన కూటమి పార్టీలకు వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులు ఝలక్ ఇస్తున్నారు. కూటమి పార్టీలకు బలం లేకపోయినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏదోలా గెలవడానికి ప్రయత్నించిన ఆ పార్టీల నేతలు భంగపడిన ఘటన యలమంచిలి మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని జంపపాలెం ఎంపీటీసీ శిలపరశెట్టి ఉమ యలమంచిలి మండల పరిషత్ వైస్ ఎంపీపీగా పదవిలో ఉన్నారు. ఈ నెల 8న ఉమను మంగళగిరి జనసేన కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్కుమార్, మరికొంత మంది జనసేన రాష్ట్ర, స్థానిక నేతల సమక్షంలో జనసేన పార్టీలో చేర్చుకున్నట్టు ప్రచారం చేశారు. ఈ మేరకు ఉమకు జనసేన పార్టీ కండువా వేసిన ఫోటోలను మీడియాకు పంపించారు. అయితే కేవలం 5 రోజుల్లోనే శిలపరశెట్టి ఉమ తిరిగి వైఎస్సార్సీపీలోకి వచ్చేశారు. బుధవారం తాడేపల్లిలో పార్టీ అధినేత వై.ఎస్. జగన్మోహన్రెడ్డితో జరిగిన యలమంచిలి నియోజకవర్గ స్థానిక ప్రజాప్రతినిధుల సమావేశంలో ఉమ ఆమె భర్త గణేష్తో హాజరయ్యారు. సమావేశంలో భాగంగా మాజీ సీఎం జగన్ను కలిసిన ఆమె ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. జనసేనలో ఐదు రోజులు కూడా ఇమడలేక తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. ఎంపీటీసీల సమావేశం ఉందని మాయమాటలు చెప్పి బలవంతంగా జనసేన కండువా వేశారని, తనకు రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్సార్సీపీలోనే కొనసాగుతానని శిలపరశెట్టి ఉమ బుధవారం రాత్రి సాక్షికి తెలిపారు. పార్టీ అధినేత జగనన్నతోనే తమ ప్రయాణం ఉంటుందన్నారు. ఈ పరిణామం నియోజకవర్గంలో రాజకీయంగా చర్చనీయాంశమైంది. కేవలం ఐదు రోజుల్లోనే జనసేనను వీడడంతో లేని బలం ఉన్నట్టు చూపించుకోవడానికి ప్రయత్నించిన జనసేన నేతలు అభాసుపాలైనట్టయిందని కూటమి నేతలు చర్చించుకుంటున్నారు.

అమ్మ పేరుతో మొక్క నాటుదాం


లైనుకొత్తూరులో మొక్కలు నాటుతున్న అధికారులు

యలమంచిలి రూరల్ : కేంద్ర ప్రభుత్వం పిలుపుతో అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం కార్యక్రమాన్ని బుధవారం యలమంచిలి ఎంపీడీవో కె. అప్పలనాయుడు, అధికారులు ప్రారంభించారు. మండలంలోని లైనుకొత్తూరు గ్రామంలో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు, ఉపాధి వేతనదారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఎంపీడీవో కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అమ్మ–మొక్క–భూమాత మూడింటి మధ్య సారూప్యత ఉందన్నారు. పర్యావరణంలోని జీవరాశులన్నింటి మనుగడకు మొక్కలు కీలకం అన్నారు. వానాకాలం మొదలైన ప్రస్తుత సమయంలో మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. సామాజిక చైతన్యంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాస్వాములు కావాలన్నారు. మండలంలో 3500 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో జీవీడీ ప్రసాద్,ఈసీ శేఖర్ బాబ్జీ, సచివాలయ సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వరి నాట్లు వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

మునగపాక (అచ్యుతాపురం): వరి నాట్లు వేసేటప్పుడు అంచులు తెంచి నాటితే వరి పొలానికి మేలు జరుగుతుందని మునగపాక మండల వ్యవసాధికారి జ్యోతి కుమారి అన్నారు. మునగపాక మండలంలోని అరబుపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరి నారు కొనలు తెంచి నాటితే ఆకు అంచులో ఉన్న కాండం తొలుచు పురుగు, ఆకు ముడత గుడ్లను నివారించవచ్చన్నారు. వరి ఊడ్పులు వరుసల్లో వేయడం వల్ల గాలి, వెలుతురు పైరుకు అందుతుందన్నారు. తద్వారా పురుగుమందుల పిచికారీ, కలుపు మొక్కల తొలగింపు సులభతరం అవుతుందన్నారు. వరుసలో ఉడుపులు వేయడం రాని వారు రెండు మీటర్లకు ఒక కాలిబాట తీసుకోవాలని సూచించారు.